క్లుప్తంగా

నీట మునిగిన నున్న పీఎస్



పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీస్‌స్టేషన్ నీట మునిగింది. నగరంలో కుండపోతగా కురుస్తున్న వర్షాలకు పాయకాపురంలోని నున్న పోలీస్‌స్టేషన్ లోపలకు వర్షం నీరు చేరింది. స్టేషన్లో ఫర్నిచర్ నీటిలోనే ఉంది. ఖైదీలుండే గదుల్లో కూడా వర్షం నీరు చేరడంతో వారు అవస్థలు పడుతున్నారు.

పెరిగిన బుడమేరు

– ఇళ్లలోకి వరద నీరు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుడమేరులో వరద ఉధృతి పెరిగింది. దీంతో బుడమేరు వరద నీరు ఇళ్లలోకి, రోడ్డుపైకి చేరుకుంది. లోతట్టు ప్రాంత వాసులు ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలిరావాలని అధికారులు కోరుతున్నారు. అయితే ఇళ్లను వదలి బయటకు రావడానికి స్థానికులు ఇష్టపడటం లేదు. బుడమేరు మధ్యకట్టలోని నగరపాలక సంస్థ పాఠశాల, కమ్యూనిటీ హాలులో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుడమేరు ఎగువ ప్రాంతాల్లో రావడంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరులోకి చొచ్చుకుపోయి ఇళ్లు నిర్మించడంతో ఆక్రమణల కారణంగా తరచూ బుడమేరు వరద బారిన పడాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బాధితులను ఆదుకుంటాం



పాయకాపురం(విజయవాడ రూరల్): ముంపు బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించి భోజన సదుపాయాలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి ముంపునకు గురైన 64వ డివిజన్లోని ముస్లింల కాలనీ, వాటర్ ట్యాంక్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం 281 సచివాలయం వద్ద లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం కనీస బాధ్యతగా గుర్తించాలని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ బి.మనోరంజని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు శనివారం 'తల్లి పేరుతో ఒక మొక్కను నాటండి'లో భాగంగా విజయవాడ బాలసదనం, ఉద్యోగినుల వసతి గృహంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, విజయవాడ అర్బన్, రూరల్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, బాలసదనం సిబ్బంది, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జారిపడిన మట్టి పెళ్లలు



వించిపేట(విజయవాడపశ్చిమ): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా స్థానిక 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు కొండప్రాంతంలోని కొండ్రు వారి వీధిలో శనివారం సాయంత్రం రిటైనింగ్ వాల్ కుంగి మట్టి పెళ్లలు కింద నివాసాలపై జారిపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొండప్రాంతంలో రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పడవల సాయంతో బాధితులను తీసుకెళ్తున్న అధికారులు



దావు బుచ్చయ్యకాలనీలో నీట మునిగిన రోడ్డు



దేవీనగర్ రైల్వేట్రాక్ అండర్ బ్రిడ్జి వద్ద..

కుండపోత వర్షం

- చెరువులను తలపిస్తున్న రోడ్లు
- ఇళ్లలోకి బుడమేరు వరద
- జనజీవనం అస్తవ్యస్తం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అల్పపీడన ప్రభావంతో నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లం ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వాన నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. బుడమేరు, ఏలూరు, రైవస్ కాలువలు నిండు కుండలా ప్రవహిస్తున్నాయి. బుడమేరుకు వరద పెరగడంతో అయోధ్యనగర్ సూరిబాబు కాలనీ, విజయదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరింది. అధికారులు బుడమేరులో వరదనీటిని ఏలూరు కాలువలోకి తరలించారు. బుడమేరు వరద మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతుండటంతో ఈ ప్రాంత వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్, నూజివీడు రోడ్డు, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, ఏలూరు రోడ్డు , దేవీనగర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. వర్షం నీటితో వాహనాలు మొరాయించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దేవీనగర్ రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు భారీగా నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు చుట్టూ తిరిగి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, నందమూరినగర్, సింగ్‌నగర్–నూజివీడు ప్రధాన రహదారితో సహా అన్ని వీధులు జలమయమయ్యాయి. వర్షం నీటితో డ్రెయిన్లు నిండటం చాలాచోట్ల ఇళ్లల్లోకి సైతం వాన నీరు చేరడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. న్యూఆర్‌ఆర్‌పేటలోని దేవినేని వెంకటరమణ మున్సిపల్ హైస్కూల్ వెంబడి ఉన్న బుడమేరు కాలువ వద్ద వలస జీవులు వర్షపునీటిలో చిక్కుకుపోయారు. వారిని కార్పొరేషన్, పోలీసులు అధికారులు ఒడ్డుకు తీసుకువచ్చి వారికి సమీపంలోని కేర్ అండ్ షేర్ స్కూల్‌లో తాత్కాలిక ఆసరా కల్పించారు. వారిలో కొందరు వ్యాధి పీడితులను మంచాలపై తరలించారు.

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): భారీ వర్షాలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు జలమయంగా మారాయి. బస్‌స్టాండ్ ఇన్‌గేట్ వద్ద భారీగా వర్షం నీరు నిలిచిపోవడంతో బస్టాండ్‌లోకి వచ్చే అనేక బస్సులు సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయి. హైదరాబాద్ రూట్లలో బస్సులు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. పలు బస్సులను దారిమళ్లించి నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. విజయవాడ డిపో, గవర్నర్‌పేట–1, 2 డిపోల్లో నీరు భారీగా నిలిచింది.



చెరువును తలపిస్తున్న సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ ప్రధాన రహదారి

ఆహార ప్యాకెట్ల పంపిణీ

భవానీపురం వరద ప్రాంతాల్లో జనసేన నాయకులు వరద బాధితులకు శనివారం ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు తిరుపతి అనూష, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



లోటస్ ల్యాండ్ మార్క్ వద్ద నీట మునిగిన రోడ్డు



57వ డివిజన్ ముంపు ప్రాంతాల్లో పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లో నీటమునిగిన ఓ వీధి



వాన నీటిలో ద్విచక్రవాహనాన్ని తోసుకువస్తున్న వాహనచోదకుడు



బుడమేరు మధ్య కట్ట వద్ద రోడ్డుపైకి చేరిన వాన నీరు

రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లపై వాన నీరు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో విజయవాడ రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లపై వర్షం నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికే ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా విజయవాడ డివిజన్‌లో అధికారులు పలు రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంల వద్ద ట్రాక్‌లపై వర్షం నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమై నీటిని తరలించే చర్యలు చేపట్టారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలలో పలు చోట్ల పైకప్పులపై లీకేజీలు ఏర్పడటంతో కురుస్తున్న వర్షాలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేత

సమాచారం కేంద్రం వద్ద విరిగిపడిన కొండచరియలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డుపై పలుచోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండ రాళ్లు జారిపడుతుండటంతో ఘాట్‌రోడ్డుపై రాకపోకలను దేవస్థానం నిలిపివేసింది. శనివారం మధ్యాహ్నం ఘాట్‌రోడ్డులోని సమాచార కేంద్రం, డోనర్ సెల్ మధ్య పెద్ద శబ్దంతో భారీ కొండ చరియలు విరిగి పడ్డాయి. వారం క్రితం సమాచార కేంద్రాన్ని రీమోడల్ చేయడానికి పనులు ప్రారంభించారు. సమాచార కేంద్రం పునర్నిర్మాణం కోసం తీసుకువచ్చిన సామగ్రి ధ్వంసమైంది. కొండచరియలు విరిగి పడే సమయంలో డోనర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఏదో శబ్దం వస్తోందని లోపల నుంచి బయటకు వచ్చారు. ఇంతలో కొండ పైనుంచి పెద్ద రాళ్లు ఒక్కసారిగా కింద పడటంతో వారు ప్రాణభయంతో పరుగులు తీశారు. డోనర్ సెల్‌కు ఓ పక్క ఉన్న అద్దాలతో పాటు షెడ్డులోని కొంత భాగం దెబ్బతింది.

మురుగు, వాన నీరు పోవడానికి స్వచ్ఛందంగా ముందుకు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లో వర్షం నీరు పోయే మార్గం లేదు. మురుగు కాలువలు కూడా లేకపోవడంతో వాన నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. రోడ్లు నీట మునిగాయి. అధికారులతో మాట్లాడితే ఆదివారం చేస్తామని చెప్పడంతో స్థానికులు స్వచ్ఛందంగా మురుగు, వర్షం నీరు బయటకు పోవడానికి పార, గునపం పట్టి తాత్కాలికంగా పనులు చేసుకున్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ అర్జా వెంకటేశ్వరరావు, బాబూరావు, ఉండి శ్రీనివాసరావు, మధు, కె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వర్షం నీరు రోడ్లపై నిలిచిపోవడంతో కాలువలు తీస్తున్న స్థానికులు

ఇంటా బయట వాన నీరు



రాజీవ్‌నగర్‌లో ఇళ్లలోకి చేరిన వాన నీరు



నీట మునిగిన రోడ్డు

పాయకాపురం(విజయవాడరూరల్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలకు నగర శివారు పాతరాజీవ్‌నగర్, కొత్త రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, పాకిస్తాన్ కాలనీ, వాటర్‌ట్యాంక్ ఏరియా, ముస్లిం కాలనీ, కండ్రిక, ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. 61వ డివిజన్ హెచ్ బ్లాక్ వద్ద, దేవినేని గాంధీపురం, ప్రశాంతినగర్ ప్రాంతాలు పల్లంగా ఉండటంతో ఆ ప్రాంతాలు నీట మునిగాయి. విజయవాడ –నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షం నీరు రెండడుగులు ప్రవహించడంతో ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.

పునరావాస కేంద్రాలకు తరలించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని బుడమేరు పరిసర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించాలని వీఎంసీ కమిషనర్ సీహెచ్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన బుడమేరు కాలువను పరిశీలించారు. సాధారణ నీటిమట్టం కంటే 15000 క్యూసెక్కుల నీటి మట్టం పెరగడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున వెంటనే అక్కడ నుంచి పునరావాస కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా ప్రజాశక్తి నగర్ కమ్యూనిటీ హాల్, లగడపాటి రాజగోపాల్ కల్యాణ మండపం, ఎస్సీ నగర్ కమ్యూనిటీ హాల్, కండ్రికలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు తక్షణమే తరలించాలని ఆదేశించారు. శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లోని ప్రజలు త్వరితగతిన ఆయా ప్రదేశాలను ఖాళీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రోడ్లపై వర్షం నీరు లేకుండా చర్యలు తీసుకోవాలి
- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ) సిసోడియా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనతో కలిసి సున్నపుబట్టీల సెంటర్‌లో కొండ చరియలు విరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అధికారులు ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు పంపాలని ఆదేశించారు. అనంతరం ఆయన మదర్‌థెరిస్సా జంక్షన్ వద్ద పరిశీలించారు. రెండు రోజులుగా పడుతున్న వర్షంతో రోడ్లపై నిలిచిన నీళ్లను ఎయిర్‌టెక్ మిషన్లతో వెంటనే తొలగించాలని, డ్రెయిన్లలో పూడిక తీయాలని ఆదేశించారు. అనంతరం ఆయన కండ్రిక రాజీవ్ నగర్, నూజివీడు రోడ్‌లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. వీఎంసీ అధికారులు ఇరిగేషన్ శాఖ సమన్వయంతో బందర్, రైవస్, ఏలూరు కాలువలో వర్షం నీటి తరలింపునకు ప్రణాళిక అమలు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ సిబ్బందితోపాటు ఇతర విభాగాల అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



వర్ష ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

యుగంధరాచార్యకు గురువందన్ పురస్కార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత వికాస్ పరిషత్ (తూర్పు) సంస్థ కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు గురువందన్ పురస్కార్ –2024 అందిస్తున్నట్లు ఆ సంస్థ గురుపూజోత్సవ నిర్వాహక కమిటీ చైర్మన్ జగన్‌మోహనరావు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జరిగే ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల ఒకటో తేదీ భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలో ఉన్న గేట్స్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్ ఆడిటోరియంలో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు.

సృజనాత్మకతతో విజయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సృజనాత్మకతతో విజయాలు సొంతమవుతాయని ఏపీ సాంకేతిక విద్యాశాఖ డెప్యూటీ డైరెక్టర్ బచ్చు నాగేశ్వరరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'హాక్‌థాన్ – 1.0' పేరుతో రెండు రోజుల పాటు హ్యాకింగ్‌పై జరిగిన జాతీయ స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు జరిగిన పోటీల విజేతలకు శనివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కళాశాల అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు మాట్లాడుతూ కంప్యూటర్స్, దాని అనుబంధ రంగాల విద్యార్థులకు తమ కళాశాల ఆధ్వర్యాన ఏటా ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఖరగ్‌పూర్ ఎన్ఐటీ, అన్నా విశ్వవిద్యాలయం చెన్నై వంటి ప్రముఖ విద్యాసంస్థలతో పాటు దేశంలోని, రాష్ట్రంలోని ప్రముఖ సంస్థల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. విభాగాధిపతి డాక్టర్ అక్బర్, కళాశాల పాలకవర్గ సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, కోశాధికారి రాఘవయ్య పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న అతిథులు

వరద బాధితులకు అన్నదానం

ఇబ్రహీంపట్నం: ప్రసాద్‌నగర్‌లో వరద ముంపునకు గురైన వంద మంది బాధిత కుటుంబాలకు కొండపల్లి షాబూఖారీ దర్గా ఆస్థాన పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్ రజా శనివారం అన్నదానం చేశారు. వర్షంలో ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న వారు మహ్మద్ అల్తాఫ్ రజాను సెల్: 98483 34075 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కార్పొరేటర్ శర్వాణీమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ శర్వాణీమూర్తి తెలిపారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సత్యనారాయణపురంలోని పలు వీధులు చెరువులను తలపిస్తున్నాయి. ఎన్నార్పీ రోడ్డు, గడియారంవారి వీధి, వ్యాకరణం వీధి, గిరి వీధి, కొమ్మువారి వీధి, బ్రహ్మయ్యపంతులు వీధి, ఏకేటీపీఎం స్కూల్ రోడ్డు, లైబ్రరీ వీధి, రామామందిరం వీధి తదితర ప్రాంతాలు పూర్తిగా జలమయంగా మారాయి. స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఆయా ప్రాంతాలను పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ముత్యాలంపాడులోని యూజీడీ సంపు పూర్తిగా వర్షం నీటిలో మునిగిపోవడంతో పంపింగ్ జరిగే అవకాశం లేక సత్యనారాయణపురంలో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయిందని తెలిపారు.

వాసవి సేవాసంఘానికి నూతన కార్యవర్గం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక మెట్లబజార్‌లోని వాసవీభవన్‌లో వాసవి సేవాసంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం శనివారం జరిగింది. ఇటీవల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం నూతన అధ్యక్షుడిగా పెరుమాళ్ల గురునాథం, ప్రధాన కార్యదర్శిగా పందిటి అశోక్‌కుమార్, కోశాధికారిగా పాదర్తి విజయగణేష్, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య సంఘం నాయకుడు దరిశి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని, సభ్యులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు గొంట్ల రామమోహనరావు, మట్టా సుబ్బారావు, చేగు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసవి సేవాసంఘం సభ్యులు